స్కెచ్

# జేబులో బొమ్మ

"రత్నం"

ఓ సినిమా కథలో వీరాధివీరుడు ఒక డుంటాడు. 'బొమ్మ' జేబులో ఉంటే చాలు...శరీరం వజ్రసమానం అవుతుంది. కాళ్ళూ — చేతులూ ఉక్కుకడ్డీలవుతయ్. ఎక్కడలేని వీరావేశం వస్తుంది. విద్యుత్తులాంటి శక్తేదో ప్రవేశించి విజయుణ్ణి చేస్తుంది. పొరపాటున 'బొమ్మ' తప్పిపోయిందో దేహం జీలుగు బెండయి, కరచరణాలు గోగుపూచలై, తావుదప్పి...ధైర్యము విలోలమై పిల్లి 'మ్యాఁ...వ్!' అంటే వణికిపోతాడు.

లోకంలో అటువంటి మనుషులు వెతికితే దొరక్కపోరు. ఆ 'బొమ్మ' లాంటి ఫోర్సు ముందుకు నెట్టుతూంటేగాని వాళ్ళకు కాళ్ళూ-చేతులూ ఆడవు. గురి కుదరటమో ... గుడ్డి నమ్మకమో కారణం ఏదయినా ఆ 'బొమ్మ' చుట్టూనే వాళ్ళ వ్యక్తిత్వం గ్రహంలా తిరుగుతూంటుంది-డన్‌లప్ పంపుగొట్టినట్టు ... క్షణక్షణమూ ఆ ప్రోత్సాహముంటేనే 'మే మున్నామని' వాళ్ళు తలెత్తి పైకి చూస్తారు.

• • •

'కాలింగ్ బెల్' మూడుసార్లు మోగేసరికి కునికిపాట్లు పడుతున్న ప్యూను కోటయ్య ఉలిక్కిపడి లేచాడు. నోట్లో నానుతున్న...సగం కాలిన చుట్ట...పాటుకు దిప్పి దమ్ములాగుతూ ఏమిటన్నట్టు చూశాడు వామనరావు వంక.

"డజన్ గారెలు!"-సైదులు హోటలు నూనె సరుక్కి ఆర్డరిచ్చాడు హెడ్మాష్టరు వామనరావు. 'గాగలు తింటే బాగుండును' సూచనాప్రాయంగా అన్న శర్మభావాన్ని అర్థంచేసుకొని వెంటనే హుకుం జారీచేశాడు. ఓ కుర్రాడు వచ్చి తొంగి చూశాడు, 'మాకీ పీరియడ్ శర్మగా'రని సణుగుతూ. 'వస్తాడులే పో!' మానేటర్ని గదిమి 'ఆఁ ఇప్పుడేం వెళ్తారు లెద్దురూ! సర్ది చెప్పేడు శర్మకు వామనరావు.

నిజం చెప్పాల్సివస్తే శర్మలో ఒక అణువు హెడ్మాష్టరు వామనరావు. ఆ అణువును అప్పుడప్పుడూ బ్రద్దలుకొట్టి స్కూలు రాజ్యంలో ప్రళయం పుట్టిస్తూంటాడు శర్మ.

ఎండలో పోవాల్సివచ్చినందుకు విసుక్కుంటూ తిట్టుకొంటూ రెండు డజన్ల గారెలు తెచ్చి టేబుల్ మీద పెట్టేడు ప్యూను కోటయ్య. యజమాని ఇంగితం ఆ సేవకుడికి తెలిసినట్టు ఎవరికీ తెలియదు-ఒకటంటే రెండు. డజనంటే రెండు డజన్లు. సోలెడు నెయ్యంటే తవ్వెడు వెన్నకాచిన నెయ్యి. అంతా డబుల్! డబుల్!

దాన్నిగురించి కోటయ్య ఓ లెక్క కూడా చెప్తాడు. తనకు ఓ సంతానమైతే వామనరావుకు రెండు. రెండయితే నాలుగు. రెండున్నర అయితే అయిదు-ఇట్లా నిష్పత్తి తప్పకుండా పుడుతున్నారని. వామనరావు పెత్తనానికి వచ్చేటప్పటికి నేతికే రెండుమూడు ఎకరాలు ఖర్చయిపోయాయనీ, రుజువుల్తోసహా ఇంత పొడుగు లెఖ్ఖ చెప్తుంటాడు వామనరావు తామరతంపర గురించీ... పుట్టుపూర్వోత్తరాల్ని గురించీ!

గారెలన్నా, వేయించిన కందిపప్పన్నా, పైరు గోంగూరన్నా, ధారగాపడే కమ్మని నెయ్యన్నా—ఇవన్నీ దొరికే సుబ్బమ్మ హోటలన్నా నిమీలిత నేత్రాలతో ఆనందపారవశ్యంతో చెప్పుకుపోతుంటాడు వామనరావు. కాని ఆ అభిరుచి చదువు చెప్పటంలో యేమాత్రం లేదు ఆ భోజనప్రియుడికి. అవన్నీ మా శర్మగారికికూడా ఎంతో యిష్టమనీ ముందూ చివరా అతుకుతుంటాడు ఉపోద్ఘాతంగా...సారాంశంగానూ!

పేరుకు తగినట్టు వామనరావు పొట్టివాడైనా పుట్టెడు బుద్ధులు మాత్రం లేవు. అప్పుడప్పుడూ ఏదో పూనినట్టు పిల్లిలా ఉండేవాడల్లా పులి అవుతాడు. మొదటి బెల్ కొట్టిన వెంటనే పిల్లలు

బయటతిరుగుతూంటే "—కొడకల్లారా! బెల్ వినిపించలా!" అంటూ వెంటబడి రొప్పుతూ లేళ్ళని తరిమినట్టు తమురుతాడు. ఇదంతా చూసి వెనక నవ్వుతూంటాడు శర్మ.

ఎవరిమీద అనుమానం తట్టినా...ఆరోజున పంతుళ్ళందరికీ నోటీసులు వస్తాయి. "నువ్ కాంపోజిషన్లు ఎన్ని వ్రాయించావ్? సిలబస్ ప్రకారం పాఠాలయ్యాయా? టీచింగ్ నోట్సు ఎందుకు చూపించటంలేదు...ట్యూషన్‌కి ఇరవై మందిని ఎవరి పర్మిషన్‌తో పెట్టుకున్నావ్?"— శర్మ దస్తూరీతోనూ హెడ్మాష్టరు సంతకంతోనూ వచ్చిన ఆ నోటీసులకి అర్థం అందరికీ తెలుసు. లిటరరీకమిటీ...లైబ్రరీ కమిటీ...ఆటల సంఘం... ఇట్లా కొందరు పంతుళ్ళను వాటిల్లోకి నామినేట్ చేస్తాడు హెడ్‌మాష్టరు. ఆయా తీర్మానాలకింద సంతకాలు కావాల్సినప్పుడల్లా ఆ నోటీసులు శరపరంపరగా వస్తాయి.

ఆ ప్రశ్నలకి సంజాయిషీ యిచ్చుకొనే ఉక్కిరిబిక్కిరిలో పంతుళ్ళంతా సతమతమై హెడ్మాష్టరు గదికి పరుగెత్తికెళ్ళి సంతకాలు పెట్టి వస్తారు ఎక్కడ చూపిస్తే అక్కడ.

సామాన్యంగా స్కూళ్ళల్లో డి. యి. ఓ. వచ్చి వెళ్ళిన తర్వాత ఏ పంతులూ కాంపోజిషన్ వ్రాయించడు. టీచింగ్ నోట్సు పద్దులకు ఉపయోగిస్తారు. తీరిక దొరికినప్పుడు పాఠాలు పాడేస్తారు. ఎవరన్నా ఇదేమిటని అడిగితే 'వాళ్ళిచ్చే జీతానికి ఈ సతుకు చాల్లెద్దురూ!' అని తూకం ప్రకార్థం చెప్పుకుపోతారు.

ఆ బలహీనతలన్నీ శర్మకు తెలుసు. అందుకే అతడంటే వామనరావుకు అంత గుఱ్ఱ!

• • •

పిల్లలు గుమికూడి, గోలచేస్తూ హెడ్మాష్టరు గది తలుపుమీద వచ్చిన వాళ్ళకల్లా దేన్నో చూపించి కేరింతలు కొడుతున్నారు. దూరాన వామనరావు కన్పించగానే ఎటువాళ్ళటు దూసుకొని గోడలచాటున నక్కటం మొదలెట్టారు ఏం జరుగుతుందో చూద్దామని!

ఆ బొమ్మను చూట్టంతోటే శర్మ వెలవెలాపోయేడు. మొదట వినోదంగా ఫీలయిన వామనరావు శర్మను చూచి ఉలిక్కిపడ్డాడు. 'జేబులో బొమ్మ' పెద్ద హెడ్డింగు. బొమ్మకింద వామనరావు అని వ్రాసి ఉంది. జేబులో ఓ కార్డు... దానిమీద 'శర్మ' అని కొట్టొచ్చినట్టున్న రెండు అక్షరాలు. అదంతా చూసి ఉగ్రుడైపోయాడు హెడ్మాష్టరు. రీసెస్ అయిపోయి క్లాసుకు వెళ్ళిన పిల్లల్ని క్లాసులో పంతుళ్ళుండగానే...బాదిబాది వచ్చాడు.

"జేబులో బొమ్మా... జేజేలా బొమ్మా!" గొడ్డ కాడ బుడ్డాడిదగ్గర్నుంచీ-ఫస్టుక్లాసు పట్టభద్రుడిదాకా పాడుకొనే ఆ పాటను, సంగీతప్రియుడైన డ్రిల్లుమాష్టరు తాళంవేసి పాడించుకొంటున్నాడు ఎక్స్ట్రావర్కు క్లాసులో. ఏ పరికరమూ లేక పోవడం మూలాన అన్ని పీరియళ్ళూ ఖాళీగా కూర్చునే మగ్గంపంతులు గడపమీద తాళంవేస్తూ హెడ్మాష్టరు గదివంక చూస్తూ యికిలిస్తున్నాడు. అన్ని క్లాసుల పిల్లలూ, మాష్టర్లతో సహా పాఠాలు మానేసి బిల్డింగు మారుమ్రోగేట్టు ఒక్కసారి నవ్వేరు ఆ పాట విని.

శర్మకు తేళ్లూ జెఱ్ఱులూ ప్రాకినట్టయింది ఆ తిరుగుబాటుకు. కాలయముడైపోయాడు వెంటనే వామనరావు. తక్షణ చర్యకు గదికి తాళంవేసి యింటికి బయల్దేరారిద్దరూ!

• • •

ఈజీచైర్‌లో పడుకొని ఏదో ఆలోచిస్తున్నాడు శర్మ కప్పుపైన అల్లుకొంటున్న సాలెగూడును చూస్తూ. కాఫీత్రాగి రేడియో ట్యూన్ చేశాడు వామనరావు. ఆ రేడియో స్కూలుదయినా ఎప్పుడూ హెడ్మాష్టరు ఇంటిదగ్గరే ఉంటుంది. స్కూల్లో ఉంటే పంతుళ్ళూ పిల్లలూ పాడుచేస్తారేమో నని భయం వామనరావుకు.

"శ్రోతలు కోరిన రికార్డులు"-రేడియో ఎనౌన్సరు చెప్పుకుపోతున్నాడు. 'ఉత్తరుడు, ఓబయ్య, విప్రశ్రీ, కళారావు.' ఇద్దరూ ఆశ్చర్యపోయారు ఒక్కసారి. వాళ్ళంతా వామనరావు ఆసిస్టెంట్లే!

'జేబులో బొమ్మా... జేజేలా బొమ్మా!' ఆ పాట విని నిర్విణ్ణుడయ్యాడు శర్మ. అంతరంగికుణ్ణి చూసి నోరు తెరిచాడు వామనరావు. ★